# Savior of the World

# లోక రక్షకుడు

(క్రిస్టమస్ నాటిక)

Christmas Play



Writen by Rev. V.Jyothi Benjamin

CLCI BIBLE INSTITUTE

Christianpet - NIDUBROLU

# లోక రక్షకుడు

(నాటిక)

పాత్రలు-పాత్రధారులు

1. సుమెయోను -
2. అన్న -
3. గాబ్రియేలు -
4. మరియ -
5. యోసేపు -
6. సత్రపు యజమాని-
7. సత్రపు యజమాని భార్య-
8. సీమోను - 1 వ గొల్ల-
9. పెద్దోడు - 2వ గొల్ల-
10. చిన్నోడు - 3వ గొల్ల-
11. హేరోదు రాజు -
12. మంత్రి -
13. జాస్పర్ -
14. బెల్తె షాజర్ -
15. మెల్కి సెదకు -
16. అబియా -
17. డప్పు వాద్యగాడు-
18. శాస్త్రి-
19. 1 వ భటుడు-
21. 2వ భటుడు-

స్టేజి అలంకరణ -

మేకప్ -

డైరెక్షన్-

ఆర్గనైజర్ --

# ప్రారంభంలో ఒక నిముషం

ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృష్టి యావత్తు సంపూర్తి చేసిన పిదప ఆదాము హవ్వలను సృజించినాడు. హవ్వ సైతానుచే మోసగింపబడింది. దేవుని ఆనతి మీరింది. పాపం లోకములో అడుగు పెట్టడానికి మార్గం సరాళం చేసింది. ఆది దంపతులు పాప భారంలో కృంగి పరితపించారు. దేవుడైన యెహోవా కరుణావాత్సల్య సంపూర్ణుడు. పాపమునకు జనకుడైన సైతాను తలను చితుకత్రొక్కి, మానవాళిని పాపభార విముక్తుల్ని చేయగల రక్షకుడు భువిలో జన్మించగలడని వాగ్దానం చేసినాడు. దినాలు వారాలుగా, వారాలు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా, సంవత్సరాలు దశాబ్ద శతాబ్ద రూపంలో దొర్లి కాలగర్భంలో కలసిపోతున్నాయి. కాని ఆ వాగ్దాన లోక రక్షకుడు అవతరించలేదు. అయినను ఆ రక్షకుని కొరకు దేవుని జనాంగము ఎదురు చూస్తూనే ఉంది. కదలిపోతున్న కాల ప్రవాహంలో అవతరించిన అనేకమంది ప్రవక్తలు ఆ లోక రక్షకుని గురించి అనేక విధములుగా ప్రవచించినారు. ఆయుననుగూర్చి ఎంతోమంది ఎదురుచూశారు. ఆయనను చూడాలని అనేకమంది పరితపించారు. ధ్యానం చేసినారు. ఈ లోకాశలను జయించి, ఇహలోక సుఖాలను, సంసారపు జీవితాన్ని వదలి ఆ రక్షకుని కొరకు ఎదురుచూస్తూ ప్రార్థిస్తూ కాలం గడిపారు. అటువంటి వారిలో ముఖ్యులు ఇప్పుడు మనం చూడబోతున్న ఈ సుమియోను ప్రవక్త మరియు అన్న అనే ప్రవక్తి - దైవసేవకురాలు. ఆ లోకరక్షకుని జన్మ వృత్తాంతమే మీ ముందు ప్రదర్శింపనున్న ఈ చిన్న నాటిక.

## 1 వ రంగము

**స్టేజి అలంకరణ:**

ఒక బల్ల, ఆ బల్లమీద పెద్ద పుస్తకము, తెల్లని అంగీతో, గడ్డంతో కుర్చీలో సుమోయోను ప్రవక్త వాక్యం చదువుతు ఉంటాడు.

**వాఖ్యానం:**

అదిగో అక్కడ చూడండి. ఆయన పేరు సూమెయోను. ఆనాటి ఆత్మీయ భక్తులకు ప్రతిబింబం. ఈ సుమియోను గురించి దేవుడు ఈలాగు సాక్ష్యం చెప్తున్నాడు. "యెరుషలేమునందు సుమెయోను అను ఒక మనుష్యుడుండెను. అతడు నీతిమంతుడును, భక్తిపరుడునైయుండి, ఇశ్రాయేలు యొక్క ఆదరణ కొరకు కనిపెట్టువాడు, పరిశుద్ధాత్మ అతని మీద ఉండెను". ఆ రక్షకుని కొరకు ఎంతో ఓపికతో కనిపెట్టిన ఈ సుమెయోను ప్రవక్త నిజంగా ధన్యుడు.....

సుమెయోను: (రెండు చేతులు పైకెత్తి) ఆకాశ మహాకాశములలో ఆసీనుడవైన మహోన్నతుడవైన దేవా! లోకరక్షకుని చూడక ముందు నేను మరణముచెందనని గొప్ప వాగ్దానమిచ్చిన ప్రభువా! ఆదినం కొరకు ఎంతో ఓపికతోను ఆతృతతోను ఎదురు చూస్తూన్నాను దేవా! ప్రభువా, దేవాది దేవా! సర్వ సృష్టికర్తా! ఆ లోక రక్షకుని త్వరగా నాకు చూపించు నాయనా! నా జీవిత కాలంలో ఒక్కసారి ఆ వాగ్దాన మెస్సియాను చూచి తరించే భాగ్యాన్ని కలుగజేయి తండ్రీ! పాప భారంతో కృంగి పోతున్న ఈ మానవాళిని త్వరగా నీ దివ్య కుమారుని ద్వారా విమోచన కలుగజేయుము ప్రభువా, నీకే నా వందనములు, స్తుతులు, స్తోత్రములు.ఆమెన్.

(తలుపు తట్టిన శబ్దం, బహు వృద్ధురాలైన అన్న ప్రవక్తి ప్రవేశం.)

సుమెయోను: (తల పైకెత్తి, ఒక చేయి పైకెత్తి) దేవుని సమాధానం మీతో నుండను గాక.

అన్న : సుమెయోనూ, దేవుని సమాధానం నీతోను ఉండునుగాక.

సుమియోను: అమ్మా! ఆ పీఠము మీద ఆసీనులుకండు. ఇంత వయస్సులో మీరు రావడమెందుకు, నాకు కబురు పంపిన నేనే వచ్చియుందును కదా!

అన్న : ఆ! ఏమి లేదు సుమియోను సోదరా! ఆలయ పనులు ముగించి వెళ్తూంటే దారిలో నీవు గుర్తుకు వచ్చి ఇలా వచ్చాను. ఈ దినాలలో నా మనసెందుకో చాలా ఆనందంగా ఉంటోంది సుమియోను. ఆ లోక రక్షకుడు అవతరించే దినాలు చాలా దగ్గరలో ఉన్నాయని నా ఆత్మ చెప్తోంది.

సుమెయోను: నాకును అలానే దర్శనాలు ఈ మధ్య వస్తున్నాయి.

అన్న : సోదరా సుమెయోను! నీవు చాలా ధన్యుడవయ్యా. ఎందుకంటే మరణించే లోపుగా ఆ లోకరక్షకుని చూస్తావని వాగ్దానం పొందావుకదా!

సుమియోను: అంతా దేవుని కృప, ఆశీర్వాదం అమ్మా.

అన్న : అవునూ ఈ మధ్య నేను ఒక విషయం విషయం విన్నాను నిజమేనా సుమియోనూ!

సుమియోను: ఏమిటమ్మా అది?

అన్న : మన యాజకుడు జెకర్యాకు దేవదూత గాబ్రియేలు ఆలయంలో దర్శనం ఇచ్చాడటగదా.

సుమియోను: అవును, ఆ విషయం నేను కూడ విన్నాను.

అన్న : మొన్న దైవ సన్నిధిని నిలిచి యాజక ధర్మం జరిగించేటప్పుడు గాబ్రియేలు దూత ప్రత్యక్షమై ఈ వృద్ధాప్య వయస్సునందు కుమారుడు కలుగునని సెలవిచ్చెనట. జెకర్యా ఆ మాటలు నమ్మజాలకపోయినందుకు ఆ బాలుడు జన్మించువరకు మూగవాడుగా ఉంటావని సెలవిచ్చి మాయమయ్యెనట.

సుమియోను: అవును విన్నాను. ఆ విషయమే నేను కూడ ఆలోచిస్తున్నాను.

అన్న : (నెమ్మదిగా, సంతోషంగా మైకు దగ్గరకు వచ్చి) ఇంకొక రహస్యం విన్నావా సుమియోను, ఆ బాలుడు పెరిగి పెద్దవాడై లోక రక్షకుని మార్గమును సరాళము చేయునట. ఎంత గొప్ప భాగ్యం.

సుమియోను: నిజమేనమ్మా! కాని ఈ జెకర్యా కుమారుడు ఆ లోక రక్షకుని మార్గాన్ని ఎంత సరాళం చేసినా, పాప పంకిలములో మునిగి తేలుతున్న ఈ లోకం ఆ దివ్య రక్షకుని అంగీకరిస్తుందా? అయినా కోటాను కోట్ల దూతల స్తుతి గానాల మీద ఆసీనుడైన ఆ దేవ దేవుడు, ఈ భూలోకంలో జన్మించి ఈ పాపపు గాలిని ఎలా పీల్చుకుంటాడో నాకు ఎంత ఆలోచించినా అర్థం కావడంలేదు.

అన్న : అవును సుమియోను! ఆ ప్రభువు ఈ మానవులతో ఎలా జీవించగలడో, ఎలా ఎదుర్కొంటాడో నాకు కూడా అర్థం కావడంలేదు. అయినా, ఆ రాబోవు దినాలు అనాదిగా దేవుడు సంకల్పించిన దినాలు. అది ఆయన ఏర్పాటు చేసుకున్న రక్షణ ప్రణాళిక. ఈ సమస్త జగత్తును సృజించిన ఆ సృష్టికర్త మానవుడై మనవాళిని రక్షించే ఈ సమయంలో ఆయనను చూచినవారు నిజంగా ధన్యులు. సోదరా సుమియోను, మనము కూడా ధన్యులమేకదా!

సుమియోను: నిజమే! మనము కూడా ధన్యులమే. ఆ దివ్యబాలుని చూడాలని ఎంతో ఆశగా ఉంది కాని ఆయన (దు:ఖంతో ఆగి పోతాడు.)

అన్న : ఏమైంది సుమియోను, ఎందుకు అంతగా బాధ పడుచున్నావు?

సుమియోను: అమ్మా! ఏమని చెప్పమంటావు, ఆయన ఈ పాపలోకంలోనుండి మానవులను రక్షించబోయే తీరు ఆలోచిస్తూ ఉంటే.... అబ్బా నేను ఉహించలేకపోతున్నాను. ఆ దేవాది దేవుడు నరుడై, పాపంలో పుట్టి పాపంలో పెరిగి, పాపాన్ని ప్రేమించే ఈ నీచమైన మానవుని రక్షించుటకొరకు ఎంతో ఘోరమైన శ్రమలను, అవమానాన్ని సహించి, భరించి, భయంకరమైన మరణానికి గురి కాబోవడం ఎంతో బాధాకరంకదా!

అన్న : ఏమిటి సుమియోను, నీకేమైనా మతిపోయిందా, ఆయన మరణించడం ఏమిటి, నీవు చెప్పేదివింటుంటే నాకు చాలా భయంగా ఉంది. మరణాన్ని సృజించిన ఆ సృష్టికర్త మరణించడమా?

సుమెయోను: అవును. ఈ ఒక్క అంశం ధ్యానించడానికే నా జీవితమంతా వ్యయం చేశాను. యెషయా ప్రవచనం గుర్తు లేదా! యెషయా 50:6 మరియు 53:2-8 చదువుతాను విను. (అంటు వాక్యం చదువును.)

అన్న : చాలు చాలు సుమెయోను. ఈ ప్రవచనాలు నెరవేరబోవుచున్నను, నా బలహీన హృదయం వాటన్నిటికి తట్టుకోలేదు. ఆయన పసికందుగా అవతరించిన క్షణాలను చూచి ప్రశాంతంగా మరణిస్తాను. ప్రభువు యొక్క ఘోర మరణాన్ని చూడబోవు ఆయన భక్తులు ఎట్లు సహించగలరోగదా.

సుమెయోను: ఇప్పటికే ఆయన తనకు తల్లిగా ఉండుటకు ఎవరో ఒక కన్యను ఎన్నుకొని ఉండాలి. ఆయన దావీదుపురములోని బెత్లెహేములో జన్మిస్తాడని లేఖనం చెప్పుచున్నది కనుక ఇశ్రాయేలులోని ఎందరో కన్యలు ఆ ధన్యత కొరకు ఎదురుచూస్తుఉన్నారు. ఆ ధన్యజీవి ఎవరో.....

# 2వ రంగము

(వాఖ్యానం- ఆ ధన్య జీవి కన్య మరియ. స్త్రీ లోకములో ఉత్తమురాలైన మరియ ప్రభవు వలన దయను పొంది, ఆ మహోన్నతుడైన దేవ దేవునికే తల్లికాగలిగే ధన్యతను పొందుకున్నది. గలిలయలోని నజరేతను ఊరిలో, యోసేపునకు ప్రధానము చేయబడిన మరియ యొద్దకు దేవదూత గాబ్రియేలు దైవ సందేశముతో వస్తున్నాడు.)

స్టేజి అలంకరణ:-- ( సామాన్య అలంకరణ, ఒక చాపపై మరియ మోకరించి ప్రార్థన చేస్తూఉంటుంది.)

మరియ : (పాట మరియు ప్రార్థన) ప్రేమ గలిగిన మా పరలోకపు తండ్రీ.... దేవాది దేవ...నిత్యుడవగు ప్రభువా.... సమాధాన కర్త... సైన్యముల కధిపతియగు యెహోవా, నిన్ను నమ్మిన జనాంగములో నన్ను జన్మింపజేసినందులకు వందనములు. కరుణగల దేవా... నేను పాపిని, నన్ను నీ కృపలోను, కాపుదలలోను, దయలోను క్షమాపణలోను కాచి జీవింపజేయు ప్రభు. దేవాది దేవా మమ్ములనందరిని రక్షించమని వేడుకొంటున్నాను ప్రభు.... ఆమెన్.

(గాబ్రియేలు దూత నెమ్మదిగా ప్రవేశించును.)

దూత : దయాప్రాప్తురాలా..... నీకు శుభము..... దేవుడు నీకు తోడైయున్నాడు.

మరియ : (భయపడుతు) ఈ శుభ వచనము ఏమైయుండునో కదా!

దూత : మరియా... భయపడవద్దు.. నీవు దేవుని వలన కృప పొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి, కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును. ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును. ఆయన రాజ్యము అంతము లేనిదై యుండును.

మరియ : (ఆశ్చర్యముతో)అయ్యా నీకు వందనములు. నేను పురుషుని ఎరుగని దాననే, ఇది ఏలాగు జరుగును?

దూత : పరిశుద్ధాత్మ నీ మీదకు వచ్చును. సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును. గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును. నీ గర్భాన జన్మించబోయేది ఆ దేవాది దేవుడు. ఆది అంతము లేనివాడు, తరతరములు రాజ్యమేలువాడు. ఇది దేవుని చిత్తమైయున్నది. కనుక ఆ ప్రకారముగా జరుగవలసియున్నది. మరియు నీ బంధువురాలైన ఎలీసబెతు కూడ తన వృద్ధాప్యమందు ఒక కుమారుని గర్భమున ధరించియున్నది. గొడ్రాలనబడిన ఆమెకు ఇది ఆరవ మాసము. దేవుడు చెప్పిన ఏమాటయైనను నిరర్థకము కానేరదు.

మరియ : (ఆనందముతో) ఇదిగో ప్రభువు దాసురాలను. నీమాట చొప్పున నాకు జరుగును గాక.

(దూత నెమ్మదిగా నిష్క్రమించును.)

మరియ : (ఆనందముగా) ఇదెంత ఆశ్చర్యం! పురుషుని ఎరుగని కన్యకనైన నేను గర్భము దాల్చుటయా! ఆయనకు యేసు అని పేరు పెట్టుటయా! యేసు అనగా రక్షకుడని కదా అర్థము. లోకరక్షకునికి తల్లిగా నుండుట దేవుడు నన్ను ఎన్నుకొనెనా! ఎంత గొప్ప భాగ్యం. ఎలీసబెతు కూడా గర్భము ధరించెనా! ఆమెకు ఇప్పుడు ఆరవ మాసమా! బంధువులమైన మాకు కబురేమి లేదే? త్వరలోనే వెళ్ళి ఆమెను కలుసుకొనవలెను.

(అంతలోనే దు:ఖముతో)

అయ్యో! నేను నీతిమంతుడైన యోసేపునకు ప్రదానము చేయబడినదానను కదా. ఇంకా పెండ్లి కాలేదుకదా. ఆయన ఎంతో ప్రార్థనాపరుడని పేరుగాంచినవాడు కదా. మరి నేను గర్భము దాల్చుట గురించి అతడేమి తలంచునోగదా. పెండ్లి కాని కన్యక గర్భవతియని లోకము ఎగతాళి చేయును కదా! పుట్టబోవు కుమారుని లోకము ఎట్లు అంగీకరించును. ఇదంతయు చాలా అయోమయముగా ఉన్నదే!

(ఆలోచించి) ఏమైనా నా విషయం యోసేపునకు తెలియపరచి ఎలీసబెతు యొద్దకు వెళ్ళెదను. నన్ను వివాహము చేసుకొనుటయో లేక వదలివేయుటయో అతడే నిశ్చయించుకొనును. అంతయు దేవుని చిత్తమైయున్నది. ---- (తెర)----

# 3వ రంగము

***స్టేజి అలంకరణ***:- ( ఒక మూల బల్లపై ధర్మశాస్త్రం ఉండాలి. ఒక చాప తప్ప మరేమి అక్కరలేదు.)
***వ్యాఖ్యానం***:- ఇతడే యోసేపు. మరియను వివాహమాడవలసిన వ్యక్తి. అయితే మరియ గర్భవతి అని తెలిసి ఎంతో బాధ పడుచున్నాడు.

(యోసేపు అటు ఇటు తిరుగుచుండును. ఏదో తీవ్రంగా ఆలోచిస్తు, బహు బాధ పడుచున్నట్లు కనిపించవలెను.)

యోసేపు : అయ్యో! ఇప్పుడు నేనేమి చెయ్యాలి, నాకు ప్రధానం చేయబడిన ఆ మరియ, పెండ్లి కాకముందే గర్భవతి యగుటయా! ఎంతో చక్కనిది. అయినా సౌందర్యం కంటే గుణవతి, భక్తి కలదిఅని విన్నానే! ఇప్పుడు ఆమెను వివాహమాడిన లోకులు నన్ను ఎగతాళి చేస్తారేమో! నాకు ఏది దారి. ఎంత మోసం. అయినా స్త్రీని గురించి సొలోమోను మహారాజు చెప్పినది ఎంత నిజం! మరణం కంటే ఎక్కువ దు:ఖం కలిగించునది ఒకటి నాకు కనబడెను. అది వలలవంటిదై ఉరులవంటి మనస్సును, బంధకములవంటి చేతులను కలిగిన స్త్రీ. పైకి ఎంత బాగా అందరిని నమ్మించి నేడు నన్ను ఇంత మోసం చేస్తుందా! (కోపంగా) ఆమెను పదిమంది పెద్ద మనుషులలోపెట్టి నాకుచేసిన ఈ ద్రోహమునకు అవమానించవలెను.... (దు:ఖం మరియు బాధతో) అయ్యో....ఏమిటి నా మనస్సు ఇంత భయంకరంగా ఆలోచిస్తున్నది. లేదు, లేదు. ఆమె అవమానించబడుట చూచి నేను సహించగలనా? దేవా! నిన్ను నమ్మి నీ వాక్యానుసారంగా నడిచే నాకు ఎందుకు ప్రభూ ఇంత బాధను విధించినావు. (ఆలోచించి)ఆమెను రహస్యంగా వదిలి వేయడం తప్ప నాకు వేరే మార్గంలేదు. ఇదేమంచి ఆలోచన. వదలివేస్తాను. రహస్యంగానే వదలి వేయడం మంచిది. వివాహసమయంలో ఇక్కడ ఉండకుండా దూరంగా వెళ్ళిపోతాను. దేవుని దయ ఈ దీనునితో ఉండునుగాక. అబ్బా! ఆలోచనలతో తల పగిలి పోతున్నది. కొంచెంసేపు నిద్ర పోతాను. అయినా గాయపడిన నా హృదయానికి, అలసిన నా జీవితానికి నిద్ర కూడా కరువే కదా!

(యోసేపు నిద్రపోతూ ఉండగా గాబ్రియేలు దూత నెమ్మదిగా ప్రవేశం)

దూత : దావీదు కుమారుడవైన యోసేపు! నీ భార్యగా ప్రమాణం చేయబడిన మరియను చేర్చుకొనుటకు భయపడకుము. ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భం ధరించినది. దేవుని కృప చొప్పున ఆమె ఒక కుమారుని కనును. ఆయనకు యేసు అని పేరు పెట్టుదురు. ఆయన తన ప్రజలను వారి పాపములనుండి రక్షించును. ఎందుకనగా "ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలు అని పేరు పెట్టుదురు." అని యెషయా ప్రవక్త పలికిన ప్రవచనం నెరవేరుటకొరకు దేవుడు ఈ విధంగా జరిగించినాడు. ఏ మెస్సియా కొరకు మీరందరు ఇంత కాలం ఎదురు చూశారో ఆయనే ఈయన. ఆయన నీతి సూర్యుడు, ఆయన రాజ్యానికి అంతంలేదు. ఆయన భుజములమీద రాజ్యభారముండును. కావున సందేహించక మరియను నీ భార్యనుగా స్వీకరించు. నేను సర్వోన్నతుడైన దేవుని దూతను. నా పేరు గాబ్రియేలు.

(గాబ్రియేలు దూత నెమ్మదిగా నిష్క్రమించును.)

యోసేపు : (దిగ్గున లేచి మోకరించి) దేవాది దేవా! ఎంతటి పాపం చేశాను ప్రభువా! ఈ ప్రజలు కన్నులుండి చూడరు, చెవులుండి వినరు అనే నీ వాక్యం నా పట్ల నిజమైనది ప్రభువా! దేవుని మహిమ తెలిసికూడా ఆయన చిత్తాన్ని గ్రహించలేక మరియను అనుమానించాను. నన్ను క్షమించి ప్రభు! యెహోవా మహా దేవా! ఆకాశమందంతట నీ మహిమను, ప్రభావమును కనపరచువాడా, నీవు జ్ఞాపకము చేసికొనుటకు నరుడు ఏపాటివాడు. నీ దేవదూత దర్శనమిచ్చుటకు నేను ఏపాటివాడను తండ్రీ! నీ దాసుడనైన నాకు నీవిచ్చిన ఈ గొప్ప దర్శనానికై వేలాది స్తోత్రములు, వందనాలు. నీవు ఎన్నుకొనిన మరియ ఎంత ఉత్తమురాలు. ఇన్ని యుగాలుగా లోకం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న ఆ లోకరక్షకునికే తల్లిగా నీ దృష్టిలో దయపొందుట మాకు నీవిచ్చిన గొప్ప భాగ్యం ప్రభువా. తెల్లవారగనే నీ దూత నాకిచ్చిన ఈ అమూల్యమైన దర్శనాన్నిగురించి మరియకు తెల్పి ధైర్య పరచెదను. అంతయు నీ చిత్త ప్రకారమే జరుగునుగాక తండ్రీ... ఆమెన్.

-----(తెర)-----

# 4వ రంగము

**వ్యాఖ్యానము**:- (మరియ నిండు గర్భవతిగా ఉన్న దినములలో దేవుని రక్షణ ప్రణాళిక చొప్పున రోమా చక్రవర్తి ఐన కైసరు ఔగుస్తు సర్వలోక ప్రజా సంఖ్య వ్రాయుటకు ఆజ్ఞ ఇచ్చెను.)

డప్పు వాద్యగాడు: (ఒక పెద్ద డ్రమ్ము కొట్టుకుంటూ వస్తాడు) అయ్యలారా! అమ్మలారా!! పట్టణ పౌరులారా!!! అందరు ఆలకించడహో.....ఇందుమూలముగా, పవిత్రమైన రోమా సామ్రాజ్యంలో నివసిస్తున్న యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా.... సర్వలోకానికి ప్రజాసంఖ్య వ్రాయాలని మహారాజరాజశ్రీ కైసరు ఔగుస్తు చక్రవర్తి యొక్క ఆజ్ఞ..... కావున రోమా సామ్రాజ్యంలోని ప్రతి ఒక్కరు ఈ ప్రజాసంఖ్యలో వ్రాయబడుటకై తమ తమ గోత్రములను అనుసరించి వారి వారి స్వంత గ్రామములకు వెళ్ళవలసినది. దీనిని అతిక్రమించినవారు కఠినముగా శిక్షించబడుదురు. ఈ సందర్భముగా ఎవరైనాగాని, ఎలాంటి ఆందోళనగాని,అలజడిగాని కలిగించరాదు. అలా చేసినచో వారు కూడా కఠినముగా శిక్షించబడుదురు. ఇది దైవసమానుడు, రోమా సామ్రాజ్యాధినేత, మహా చక్రవర్తి ఐన శ్రీశ్రీశ్రీ కైసరు ఔగుస్తు మహారాజుగారి ఆజ్ఞ, కనుక తెలియ జేయడమైనదహో.......

(డ్రమ్ము కొట్టుకుంటూ వెళ్తాడు)

---(తెర)---

## 5వ రంగము

***వ్యాఖ్యానము*** :-- యోసేపు, మరియల పేర్లు యూదయాదేశములోనున్న బెత్లెహేము అనే ఊరిలో ఉండుటవలన తమ పేర్లను జనాభా సంఖ్యలో వ్రాయించుకొనుటకు యోసేపు నిండు గర్భవతియైన తన భార్య మరియను తీసుకొని నజరేతును వదలి బెత్లెహేమునకు బయలుదేరి వెళ్ళినారు. ఆ పట్టణమంతా జనాభా సంఖ్యలో పేర్లు వ్రాయించుకొనుటకై వచ్చినవారితో నిండిపోయినది. సరిగ్గా అదే సమయంలో మరియకు పురిటినొప్పులు కూడా ప్రారంభమయినాయి.

***స్టేజి అలంకరణ***:-- (తెరతీయగానే బెత్లెహేము వీధి. యోసేపు, మరియ మెల్లగా నడుస్తూ ఉంటారు. మరియ, యోసేపు భుజముమీద ఆనుకొని ఒక చేయి నడుము మీద ఉంచుకొంటుంది. వారికి ఎదురుగా అబియా వస్తాడు.)

యోసేపు : అయ్యా.... కొంచెం ఆగండి.... మీది ఈ ఊరేనా?
అబియా : అవును.... మాది ఈ ఊరే.... మీది ఏ ఊరు?

యోసేపు: ఒకప్పుడు మాది కూడా ఈ ఊరే.. కాని నజరేతులో ఉంటున్నాము.
అబియా: ఓహో! అయితే మీరిక్కడకు జనాభా లెక్కల కోసం వచ్చారా?

యోసేపు: అవునయ్యా! మేము అందుకోసమే వచ్చాము. కాని మాకు ఇక్కడ తెలిసినవారు ఎవరు కూడా లేరు. కొంచెం సహాయం చేయగలరా?
అబియా: ఏమి సహాయం కావాలి మీకు.... ఇంతకు మీది ఏ గోత్రం?

యోసేపు: మాది దావీదు గోత్రం. నా పేరు యోసేపు. ఈమె నా భార్య మరియ, నిండు గర్భవతి. ప్రసవదినాలు నిండినవి. ఎక్కడైనా తలవాల్చుకోవడానికి కాస్తంత చోటు చూపించగలరా?
అబియా: యోసేపు! నీ పరిస్థితి చూస్తుంటే నాకు జాలిగానే ఉంది. కానీ.....(ఆలోచిస్తూ ఉంటాడు.)

యోసేపు: అయ్యా... మీ సానుభూతికి వందనాలు...కాస్త దయచూపండయ్యా... మీపేరేమన్నారు బాబు?
అబియా: నా పేరు అబియా. నీవు నిజంగా చాలా ఆలస్యంగా వచ్చావు యోసేపు. ఇప్పుడు పట్టణమంతా ప్రజలతో నిండి పోయింది. ఎక్కడ కూడా చోటు దొరకడంలేదు. అంతెందుకు, నీవు నిన్న వచ్చినట్లయితే మాఇంట్లోనే ఒక గది ఇచ్చేవాడిని. మాది పెద్ద ఇల్లే, కాని ఇప్పుడు బంధువులతో నిండిపోయి చాలా ఇరుకుగా ఉంది. కాలు కూడా మెదపడానికి వీలు లేకుండా ఉంది.
యోసేపు: అయ్యా...అయ్యా... కొంచెం జాలి చూపండి బాబు.
అబియా: ఔనౌను.... అదేననుకో.... (ఆలోచించి) ఆ!.... నాకు ఒక స్నేహితుడున్నాడు... అతనికి ఒక సత్రం ఉండాలి. కాని బహుశా అది కూడా నిండిపోయి ఉంటుందేమో!

యోసేపు: అయ్యా... నెనెక్కడైనా తలదాచుకుంటాను. కాని నా భార్య గురించైనా కొంచెం సహాయం చేయండి.
అబియా: సరే... ఐయితే అక్కడకు వెళ్దాం పదండి.

(వెళ్తుండగా తెర పడును)

## 6వ రంగము

స్టేజి అలంకరణ:- సత్రమునిండా మనుష్యులే. పిల్లల గోల బహు సందడి సందడిగా ఉండును.

(సత్రపు యజమాని వారందరిని సర్దుతూ ఉంటాడు. అతని భార్య రయ్...న సుడిగాలిలా రావాలి.)

సత్రపు యజమాని: ఎన్ని సార్లు పిలవాలి నిన్ను, నేను ఒక్కడినే ఈ సత్రంలో ఉన్నవారిని సర్దలేక పోతున్నాను. వచ్చి కొంచెం సహాయంచెయ్యి.

యజమాని భార్య: నాకు వేరే పని ఏమి లేదనుకున్నారా ఏమిటి. అయినా ఏమిటి ఈ మాయదారి సంత. ఇంతమంది జనమా? ఆ రోమన్ రాజుకు ఏంపోయేకాలమొచ్చిందో ఇలా అందరిని మన నెత్తిమీదకు తోలుతున్నాడేమండి.

సత్రపు యజమాని: ఉష్...... నోరుముయ్యి.... వాడిపోయేకాలం గురించి మాట్లాడడానికి నీకేం పోయేకాలం వచ్చిందే తల్లి. ఎవరైనా సైనికులు వింటే మనకు పోయేకాలం వస్తుంది. ఇలా వచ్చి కాస్త సాయం చెయ్యి.

యజమాని భార్య: అదికాదండీ... సత్రపు గదులన్ని నిండాయి. ఇల్లంతా నిండిపోయింది. కాని ఇంకా జనం వరద వచ్చినట్లు వస్తున్నారు. అసలు నిలబడటానికికూడా చోటు లేదు. అయినా ఇంకా ఎంతమందికి చోటు ఇస్తాము, ఎంతమందినని సర్దుతాము. అవతల నాకు బోలెడు పనులున్నాయి. నావల్ల కాదు బాబు ఈ సత్రపు పనులు, ఈ సర్దడాలు.

(మరో కుటుంబం ప్రవేశం. భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు)

భర్త : సహోదరా. దేవుని సమాధానం మీతోను, మీ సత్రము మీదను ఉండునుగాక. మాకు ఒక గది ఇప్పించుడు.

సత్రపు యజమాని: సహోదరా! నీకును, నీకుటుంబమునకును సమాధానం కలుగునుగాక. మీరెందుకొచ్చారో అర్థమగుచున్నది. కాని ఇక్కడ గదులు ఏమాత్రం ఖాళీ లేవు.

భర్త :అయ్యో.. అలా అనకండి... మేము మీ గురించి చాలా విని ఇక్కడకు వచ్చాము. మీరు చాలా కృపగలవారని, కరుణా సముద్రులని, దయా హృదయులని, మీ సత్రం ఒక దేవాలయమని, ఒక ప్రశాంత నిలయమని, ఒక ఏదేను వనమని... ఇంకా చాలా విన్నాము. కాబట్టి ఒక గది ఇవ్వండి. మీరు తప్ప మాకు దిక్కు లేదు. దయచేసి ఇవ్వండి.

సత్రపు యజమాని: (పొంగిపోయి) సరే....సరే.....మీ ముగ్గురికి మాత్రం ఏదోరీతిగా స్థలం చూపించగలను. గదులయితే ఖాళీ లేవుగాని, ఇదిగో ఈ వరండాలో సర్దుకొండి.

యజమాని భార్య: (భర్తను ప్రక్కకు పిలిచి) ఇంకెక్కడ నెత్తికెక్కించుకుంటావయ్యా వీళ్ళను. వరండాలో ఎంతమందికని ఇస్తావు చోటు. కనీసం వీళ్ళు కాస్త నడుం వాల్చుకోవడానికైనా స్థలం కావాలా అక్కరలేదా?

సత్రపు యజమాని: ఈముగ్గురిని ఉండనిద్దాం లేవే! ఇంకెవరిని తీసుకోవద్దు సరేనా! గట్టిగా అరవకు, నీ గయ్యాళితనం అంతా బయటపడుతుంది.
(అంతలో తలుపు మీద చప్పుడు)

యజమాని భార్య: ఇంకెవరు బాబు, ఇక నీ నెత్తిన ఒకరు, నా నెత్తిన ఒకరు ఎక్కవలసిందే, ఖాళీ ఏ మాత్రంలేదని పంపించి వేయండి.

(యోసేపు, మరియల ప్రవేశం, సత్రపు యజమాని భార్య మరియను చూస్తు నిలబడుతుంది)

యోసేపు : అమ్మా..... అయ్యా..... దేవుని సమాధానం మీతో ఉండునుగాక. దావీదు వంశపు వారము. జనాభా లెక్కల కొరకు నజరేతు నుండి ప్రయాణమై ఈ ఊరు చేరాము.ఊరంతా వెదికినా ఎక్కడా కాస్త కూడా చోటు దొరకలేదు. చాలా అలసి పోయాము. నా భార్య నిండు చూలాలు, ప్రసవవేదన పడుతున్నది. కొంచెం దయచూపి తలదాచుకోనివ్వండి.

మరియ : అమ్మా.... చాలా అలసిపోయి ఉన్నాను. దయచేసి ఒక గంటైనా నన్ను కొంచెం కూర్చోనీయమ్మా. దేవుడు నిన్ను దీవిస్తాడు తల్లి!

యజమాని భార్య: అయ్యయ్యో! నీ కెంత కష్టం వచ్చింది తల్లీ! ఏమయ్యా నిండు చూలాలయ్యా.. అలా చూస్తు నుంచోకపోతే ఏమైనా సత్రంలో ఖాళీ ఉందేమో చూడవయ్యా!

సత్రపుయజమాని: అయ్యో... లోపల గదులన్ని నిండి పోయాయి. ఎక్కడా ఖాళీ లేదు. వరండా కూడా నిండి పోయింది. ఇప్పుడేంచేద్దాం?

యజమాని భార్య: నీవు చేసే పనులన్ని ఇలాగే ఉంటాయి. అనవసరమైనవాళ్ళందరిని నెత్తికెక్కించుకున్నావు, ఇప్పుడేమో అవసరమైనవాళ్ళకు చోటు లేదు. ఏం మాయదారి సత్రమో ఏమో! (మరియ భుజం మీద చేయి వేస్తూ) బిడ్డా చూస్తున్నావు కదా! ఇక్కడ సత్రంలో కూర్చోగలిగిన స్థలం దొరికినా నీకు విశ్రాంతి ఏముంటుందమ్మా. మా పశువుల శాల చాలా శుభ్రంగా ఉంటుంది. ఏ అవసరం ఎలా ఉంటుందోనని పశువులన్నిటిని ఒక ప్రక్కనే కట్టి వేశాను. మిగతా స్థలం అంతా శుభ్రంగా ఉంచాను. ఈ సందడి తగ్గేవరకు అక్కడ ఉంటారా?

యోసేపు, మరియ: అమ్మా .....చాలా వందనాలు.... మీకెంతో ఋణపడి ఉంటాము.

(సత్రపు యజమాని భార్య మరియను తీసుకొని ముందు నడచుచుండగా తెర)

# 7వ రంగము

***స్టేజి అలంకరణ***:-( పశువుల తొట్టిలో పొత్తిళ్ళలో పసిబాలుడు ఉంటాడు, మరియ అలసి పోయి కూర్చుంటుంది. యోసేపు తొట్టి సరిచేస్తుంటాడు. వీలును బట్టి దూతలు తిరిగినట్లుగా చూపించవచ్చును.)

**వ్యాఖ్యానము**:-( ఆ అందమైన క్రిస్‌మస్ రాత్రిలో మరియ ఆ పశువుల పాకలో ఏసుబాలునకు జన్మను ఇచ్చింది. తన తొలిచూలు కుమారుని కని పొత్తిగుడ్డలతో చుట్టి ఆ లోకరక్షకుని ఒక పశువుల తొట్టిలో పరుండబెట్టినది. యుగయుగాలనుండి ఎదురుచూస్తున్న లోకరక్షకుడు తన కన్న తండ్రిగా, తన బంగారు పంటగా జన్మించడం మరియను ఆనందంలో ముంచెత్తుతున్నది. ఆ సంతోషంలో లోకరక్షకునికి ఏవిధంగా జోల పాట పాడుతుందో విందాం)

(జోలపాట అనంతరం తెర పడుతుంది)

# 8వ రంగము

***స్టేజి అలంకరణ***:- (కొండ ప్రాంతం.....రాత్రి సమయం, చలిమంట వెలుగుతూ ఉంటుంది. గొర్రెలకాపరులైన సీమోను అనే వృద్ధుడు, పెద్దోడు, చిన్నోడు చలిమంట ముందు చలికి వణకుతుంటారు. ముగ్గురి చేతులలో గొఱ్ఱెలను కాచే కర్రలుంటాయి.)

సీమోను :- ఒరే సిన్నోడా! గొర్రెలన్నిటిని మల్లేసావట్రా! .....ఏందిరా అట్టా వణకుతుండావు. మాకాలంలో మేము మీ వయస్సులో ఉన్నప్పుడు ఎట్టా ఉండేవాళ్ళం......ఎన్ని పనులు చేసేటోల్లం...ఎహె! ఆ వణుకుడేందిరా... కూత్తి మంటనెగెయ్యరా బాబు.

పెద్దోడు :- ఊకె సెత్త కబుర్లు సెప్పకు సీమోను మావా! నీలాంటోళ్లని చానా మందిని చూశా! ఈ రేత్తిరి ఎందుకో చానా పెశాంతంగా చానా చానా చలిగా ఉంది మావా! ఒరేయ్ సిన్నోడా! కాత్తి గెడ్డెయిరా... చలి ఎముకల్ని కొరికేత్తందిరా.

సిన్నోడు :- ఏందిరన్నా చలిమంట దగ్గిర కూకుని ఇంకా చలంటావు! ఎంత మంటేసుకున్నా చలి చిలిగానే ఉంటదిగనే ఇదిగో తాతా! ఈ చలిగిలి పోవాలంటే నువ్వే ఏద్దైనా ఓమంచి కత సెప్పవే

పెద్దోడు :- నిజవేఁరా సిన్నోడా! ఇదిగో సీమోను మావాఁ! మొన్న సెప్పావు సూడు, దావీదు కత అది సెప్పు మావాఁ! ఎన్నిసార్లు ఇన్నా ఇంకా ఇనాలనిపిత్తంది.

సిన్నోడు :- మొన్నేగా సెప్పిందాకత..ఇంకెన్నిసార్లు ఇంటావన్నా! ఇదిగో తాతా! యోసేపు కత సెప్పు తాతా!

పెద్దోడు :- నోర్మూయిరా సిన్నోడా! ఇదిగో మావా, దావీదు కతే సెప్పు.
సిన్నోడు :- వద్దు, నాకు యోసేపు కతే కావాల,
పెద్దోడు :- కాదు, దావీదు కత సెప్పు మావా!
సిన్నోడు :- కాదు యోసేపు కతే (ఇద్దరు కాసేపు వాదులాడుకుంటారు)
సీమోను :- ఎహె ఊరుకోండెశా! ఏందిరా మీ గొడవ... (నిట్టూరుస్తు) ఒరేయ్! ఎన్ని కతలు సెప్పినా అసలు కత మాత్రం జరగడం లేదురా!
పెద్దోడు :- ఏందా కత మావా
సిన్నోడు :- ఏందా కత ....తొందరగా సెప్పు తాతా...
సీమోను : అదేరా లోక రచ్చకుడి కత... మా తాత ముత్తాతల దగ్గిర నుండి సెప్పుకుంటూ వత్తాన్నారా కత. కాని ఇంత వరకు జరగలేదురా!
పెద్దోడు :- అయితే మావా! అసలు లోక రచ్చకుడు పుడతాడంటావా! ఒకేళ అ దేవుడు లోక రచ్చకుడిగా పుట్టినా మనసుంటోళ్ళకి కనపడతాడంటావా, ఒకేళ కనపడినా మనసుటోళ్ళం సూడగలమంటావా, ఎందుకంటే మోషే అంతటోడే ఆ దేవుడ్ని సూడలేకపోయాడు గదా!
సిన్నోడు :- మనసుంటోళ్ళకి కనబడకపోతే మనకు రచ్చకుడు ఎట్టా అవుతాడన్నా! అయినా తాతా, అసలు లోక రచ్చకుడు ఎప్పుడు పుడతాడు? ఎక్కడ పుడతాడు తాతా!
సీమోను :- అవునురా సిన్నోడా! లోక రచ్చకుడు ఎక్కడ పుట్టినా, ఎప్పుడు పుట్టినా మనసుంటోళ్ళకి తప్పక అగపడతాడరా! అందులో అనుమానం లేదు! అంతా దేవుని సిత్తంరా! .....ఆ....(ఆవులిస్తూ) ఒరేయ్ పెద్దోడా నే కాసేపు బబ్బుంటానుగాని మందని మల్లేయ్యరా.. నేను లేచేదాకా మేలుకొని ఉండంఢ్రా... తోడేలొస్తే జాగ్రత్తరోయ్...(పడుకుంటాడు)
పెద్దోడు :- ఒరేయ్ సిన్నోడా... నేను కూడా కాసేపు ఓ కునుకు తీస్తాగాని నువ్వు మందని మల్లెయిరా! తోడేలొస్తే జాగరతరోయ్...(పడుకుంటాడు)
సిన్నోడు :- తోడేలా.. గీడేలా... దీని సిగతరగ... నాగ్గని తిక్కరేగిందంటే... సంసోనన్న సింహాన్ని సంపినట్లు, దావీదన్న తోడేల్ని సంపినట్లు నేను కూడా సంపి అవతలపారెయ్యను...(లేచి) డుర్....డుర్ (మందని మల్లేసినట్లు స్టేజి అంతా తిరిగి తాను కూడా నిద్రిస్తాడు)

(అంతలో మంచి సువర్తమానపు సంగీతం మెల్లగా వినిపిస్తుంది. దూత ప్రవేశించు సరికి ఆ సంగీతం గట్టిగా మ్రోగాలి. వీలైతే వెలుగు కూడా కనిపించాలి. గొల్లలు ఒక్కసారి ఉలిక్కిపడి నిదురలేచి భయంతో వణకుచుండగా)

దూత :- గొల్లలారా.... భయపడకుడి..... ఇదిగో ప్రజలందరికి కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు. దానికిదే మీకానవాలు. ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి పశువుల తొట్టిలో పండుకొనియుండుట మీరు చూచెదరు. ఈయనే లోకరక్షకుడు. సర్వోన్నతమైన స్థలములో దేవునికి మహిమయు ఆయన కిష్టులైన మనుష్యులకు సమాధానము కలుగునుగాక...

(దూత మెల్లగా లోనికి వెళ్ళును)

సిన్నోడు :- ఎంత ప్రకాశమనమైన వెలుగు... దేవుడు దేవదూతను పంపాడు
పెద్దోడు :- అవునురా సిన్నోడా. ఆ లోక రక్షకుడు మన కోసం ఈ భూమ్మీద పుట్టాడంట మావా!
సీమోను:- నిజమేరా... ఆ లోక రక్షకుడు మనలాంటివారి కోసమే పుట్టాడు. మనం వెంటనే వెళ్ళి దర్శనం చేసుకుందాం పదండి.

( ------ తెర------ )

## 9వ రంగము

***స్టేజి అలంకరణ***:- ( తెర తీయగానే ముగ్గురు జ్ఞానులు ఆకాశంవైపు చూస్తుంటారు. ఒక మూలన పైన నక్షత్రం వెలుగుతూ ఉంటుంది.)

***వ్యాఖ్యానం***:- (ఆ అందమైన రాత్రిలో ఒక ప్రకాశవంతమైన నక్షత్రం లోక రక్షకుని జన్మదిన సూచనగా ఆకాశంలో తూర్పున ఉదయించింది. ఆ ఉదయించిన ప్రకాశవంతమైన నక్షత్రన్ని చూచి తూర్పు దేశాన ఉన్న ముగ్గురు జ్ఞానులు ఆ లోక రక్షకుని చూడాలని బయలుదేరి వస్తున్నారు.)

1వ జ్ఞాని :- చూడండి మిత్రులారా! ఎంతో కాంతివంతంగా వెలుగుచున్న ఆ నక్షత్రాన్ని చూడండి.
2వ జ్ఞాని :- అవును మిత్రమా జాస్పర్! దాని అర్థం, ఆ లోక రక్షకుడు ఇక్కడెక్కడో పుట్టి ఉండాలి.
3వ జ్ఞాని :- అవును మిత్రులారా! ప్రవక్తల ప్రవచనాల ప్రకారం ఆ లోక రక్షకుడు ఈ యూదయా దేశంలోనే ఎక్కడో పుట్టి ఉండాలి.

1వ జ్ఞాని :- అయితే మిత్రమా మెల్కిసెదక్ !ఈ కారణంవల్లనే ఈ నక్షత్రం యూదయా దేశం వరకు మనకు దారి చూపించి ఆగిపోయిందంటారా? మీరేమంటారు మిత్రమా బెల్తె షాజర్!
2వ జ్ఞాని :- నీవన్నది సత్యం మిత్రమా! అందువలన మనం వెంటనే వెళ్ళి ఈ యూదయా దేశపు రాజైన హేరోదును కలసి ఆ లోక రక్షకుని చేరుటకు సరైన దారి అడిగి తెలుసుకుందాం. తమరేమంటారు మెల్కిసెదకు మహాశయా!
3వ జ్ఞాని :- అవును మిత్రులారా! మీరన్నది నిజం. ఇది చాలా మంచి ఆలోచన. త్వరగా వెళ్దాం పదండి.

(--- తెర---)

## 10వ రంగము

స్టేజి అలంకరణ :- ( హేరోదు మహారాజు మందిరము. మధ్యలో రాజ సింహాసనము. ఒక భటుడు రాజుగారికి విసురుతూ ఉంటాడు. హేరోదు ఠీవిగా సింహాసనాసీనుడై ఏదో ఆలోచిస్తూ ఉండగా మంత్రి ప్రవేశం)

మంత్రి :- జయము జయము మహారాజా
హేరోదు :- ఆసీనులుకండు మంత్రివర్యా! ఏమిటి విశేషములు, మా ప్రజలు మాపరిపాలనను గురించి ఏమనుకొనుచున్నారు?

మంత్రి :- చిత్తం ప్రభు! తమరి గురించి చాలా గొప్పగా చెప్పుకుంటున్నారు ప్రభు!

హేరోదు :- హాఁ....హాఁ....హాఁ... (పెద్దగా నవ్వుతూ) అవును నేనే గొప్పరాజును. ఈ యూదయా దేశాన్ని పరిపాలించే గొప్పరాజును నేనే! నన్ను మించిన రాజు వేరొకడు లేడు. హాఁ....హాఁ...హాఁ ....అయినా....(అంటూ లేచి ఆలోచిస్తూ అటు ఇటు తిరుగుతూ ఉంటాడు.)

మంత్రి :- (మంత్రి కూడా లేచి) ఏమిటి ప్రభూ! ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?

హేరోదు :- అవును మహామంత్రి! చాలా దినములనుండి మా మనసెందుకో ఆందోళనగా ఉన్నది. ఏదైనా జరగరానిది జరుగుతుందా అని మా ఆలోచన.

మంత్రి :- రాజు చిరంజీవియగుగాక! మహారాజు మనస్సులో ఆందోళన? ఆశ్చర్యముగానున్నదే! దైవ జనులమని చెప్పుకొనే ఈ యూదా జనాంగాన్ని సహితం జయించిన రాజాధిరాజులు మీరు. అటువంటి తమరు ఆందోళన చెందుటయా? ఏమిటి మీ సందేహం మహారాజా?

హేరోదు :- మహా మంత్రులకు తెలియని రహస్యములేమున్నవి? ఈ యూదా జనాంగము ఎప్పుడు కూడా మాకు ప్రక్కలో బళ్ళెమే. అయినా వారిని మంచి చేసుకోవాలని వారి దేవాలయమునకు కోట్ల కొలది డబ్బు వెచ్చించాను. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సాంకేతికనిపుణులతోను, భవన నిర్మాణకులతోను, పనివారితోను ఆ దేవాలయాన్ని కట్టించితిని. ప్రసిద్ధిగాంచిన పాలరాళ్ళతోను, శిల్పఔన్నత్యంతోను అలంకరించితిమి. (కోపంగా పళ్ళు కొరుకుతు) ఇంత చేసినా ఫలితమేమి. ఈ యూదా జనాంగము వట్టి మూర్ఖులు, విశ్వాసంలేని బ్రష్టులు.

మంత్రి :- మహారాజు శాంతం వహించుగాక....ఈ యూదా జనాంగము ప్రత్యేకమైన జనమని మరియు సజీవుడైన ఆ యెహోవా దేవుని జనాంగమనికదా లోకప్రసిద్ధము.

హేరోదు :- (ఎగతాళిగా) ఆహాహా.....ప్రత్యేకమైన జనాంగము. ఎందులో ప్రత్యేకత? దేనిలో ఆ ప్రత్యేకత? వారి దేవునికే ఎదురు తిరిగి తిరుగుబాటుచేయుటలోనా ఆ ప్రత్యేకత? వారి దేవుడు వారికిచ్చిన అద్భుతమైన ఆ పది ఆజ్ఞలకు కూడా ఎదురు తిరిగి, ఐగుప్తులోను, బబులోనులోను చెరలో మ్రగ్గి తమ చావును తామే కొనితెచ్చుకొనుటలోనా ప్రత్యేకత. కృతజ్ఞతలేని యూదులు. అయినా చరిత్రలో అనేకమంది రాజులు వారిని సర్వనాశనం చేసినా వారి జాతి ఇంకా మిగులుతూనేఉంది. అదే మాకు ఆశ్చర్యంగా ఉంది మంత్రివర్యా!........ (కూర్చుంటాడు)

మంత్రి :- ఏలినవారికి యూదుల దైవ గ్రంథం బాగుగ తెలిసినట్లున్నదే! యూదులలో పాపులను నశింపజేసి మిగిలిన శేషాన్ని ఉంచుతాననికదా వారి దేవుని వాగ్దానం?

హేరోదు :- అయినా వారు ఎంతమంది ఉంటే మాకేమి. కాని ఒక్కటే సందేహం మమ్ములను కలవరపెట్టుచున్నది.

మంత్రి :- తమరి మనస్సును అంతగా కలతపెట్టే ఆ విషయం ఏమిటి మహారాజా?

హేరోదు :- మీకు తెలియనిదేమున్నది అమాత్య! ఈ మేము వారి దేవాలయం కట్టినినాటనుండి ఈ యూదుల ప్రార్ధనలు మరీ ఎక్కువయినవట. వారిని విమోచించే మెస్సియా త్వరగా రావాలని, వారిని మన హస్తాలనుండి విడిపించి వారికి ప్రత్యేక రాజ్యమివ్వాలని వారి ప్రార్ధనలని మన వేగులవారి సమాచారము. మనం ఇంత ఖర్చుపెట్టి దేవాలయం కట్టించిఇచ్చినా మన మీద విశ్వాసం ఏమాత్రం లేదు. కైసరు చక్రవర్తి జనాభా లెక్కలు వ్రాయించ మొదలుపెట్టిన నాటినుండి ఈ యూదులలో మెస్సియా గురించి ప్రార్ధనలు మరీ ఎక్కువయినవని వేగులవారి సమాచారం. ఆ వచ్చువాడు మమ్ములను మించుతాడేమోనని మా సందేహం.

మంత్రి :- మహారాజునకు ఇట్టి సందేహము కలుగనేల? అటువంటి మెస్సియాలు ఎంతమంతి వచ్చినా తమరి ముందు నిలువగలరా! ప్రభువులు తమ కలత మరిచిపోవుదురుగాక.

(భటుని ప్రవేశం)

భటుడు :- జయము జయము మహారాజా! తమరి దర్శనం గురించి ఎవ్వరో ముగ్గురు వచ్చారు ప్రభు. తూర్పు దేశపు జ్ఞానులట.

హేరోదు :- తూర్పు దేశపు జ్ఞానులా....(ఆలోచించి)... హాః...హాః....హాః...(పెద్దగా నవ్వుతూ) చూశారా మంత్రివర్యా... తూర్పు దేశపు జ్ఞానులట.... మమ్ములను చూడాలని వచ్చారట.. అంటే మా గొప్పతనం, మా పేరు తూర్పు దేశం వరకు చేరిందన్నమాట. హాః...హాః.....హాః....చాలా సంతోషం మంత్రి వర్యా! మీరు స్వయంగా వెళ్ళి వారిని సగౌరవంగా లోనికి తీసికొని రండు.

మంత్రి :- చిత్తం ప్రభు! తమరి ఆజ్ఞ!! (మంత్రి వెళ్ళి జ్ఞానులతో తిరిగి వస్తాడు.)

జ్ఞానులు :- (ముగ్గురు కుడిచేతిని చాపి దీవిస్తూ) హేరోదు మహారాజులవారికి జయము జయము. దేవుని కృపవలన తమరు చిరంజీవులగుదురుగాక!

హేరోదు :- తూర్పు దేశపు జ్ఞానులారా! మీకిదే మా ఆహ్వానము!! మీనామధేయములేవో, మీరాకకు కారణమేమో సెలవివ్వండి

1వ జ్ఞాని :- నా పేరు జాస్పర్

2వ జ్ఞాని :- నన్ను బెల్తెషాజర్ అంటారు

3వజ్ఞాని :- నేను మెల్కిసెదకును. మేము ముగ్గురము తూర్పు దేశమునుండి వస్తున్నాము. ఆకాశంలో అవతరించిన ఒక వింత తారను చూచి ఇలా వస్తున్నాము.

హేరోదు :- (ఆశ్చర్యముతో) వింత తారయా?....

1వ జ్ఞాని :- అవును మహాప్రభు! చలించు ఆ తార ప్రయాణాన్ని గమనించుచు మేము బహు దూర ప్రయాణము చేసి ఇక్కడకు చేరితిమి.

2వ జ్ఞాని :- ఆ వింత తార ఆకాశంలో అవతరించిందంటే ఎవరో గొప్పరాజు జన్మించిఉండాలి.

3వ జ్ఞాని :- అవును... ఆ నక్షత్రం మీ యూదయా దేశం వరకు వచ్చి ఆగిపోయిందంటే ఆ యూదులరాజు మీ దేశంలోనే పుట్టి ఉండాలి. కనుక ఆ యూదుల రాజుగా పుట్టినవాడు ఎక్కడ ఉన్నాడో మాకు తెలియజేసినట్టయితే మేము వెళ్ళి పూజించి వస్తాము.

హేరోదు :- మీ మాటలు మాకెంతో ఆశ్చర్యముగనున్నవి. (కోపంతో) మంత్రి ఏమిటి వీరు మాట్లాడుచున్నది.

మంత్రి :- (రాజుగారి చెవిలో ఏదో రహస్యంగా చెప్పి) యూదులు యుగయుగాలుగా ఎదురు చూస్తున్న ఆ పుణ్యపురుషుడు అవతరించెనా? అది మాకుని ఇంకా తెలియలేదు.

హేరోదు :- (సంతోషం నటిస్తూ) అవునవును... మహామంత్రుల ఆలోచన సమయస్ఫూర్తిగా ఉన్నది. ఆ రాజు రాక కొరకే మేమును ఎదురుచూచుచుంటిమి. యూదులు నిజముగా గొప్ప దైవభక్తులు. వారు ఎన్నో వేల సంవత్సరాలనుండి ఎదులుచూస్తున్న వారి అవతార పురుషుడు నేటికి ఉదయించెనన్నమాట. అయినను మంత్రివర్యా, ఆ యూదులరాజు జననమును గూర్చి వారి ప్రవక్తలు ఏమైనా ప్రవచించిరేమో? పరిశీలించుదాం. ఎవరక్కడ...(భటుడు ప్రవేశము)

భటుడు :- జయము జయము మహారాజా!

హేరోదు :- నీవు ప్రధానయాజకుల యొద్దకు వెంటనే వెళ్ళి లేఖనములు బాగుగా తెలిసిన ఇద్దరు శాస్త్రులను పంపవలెనని మా ఆజ్ఞగా వినిపించుము.

భటుడు :- చిత్తం మహా ప్రభు!

జ్ఞానులు:- (ముగ్గురు) మీకు పని కల్పించినందులకు క్షమించండి ప్రభు.

హేరోదు :- అదేమిలేదు జ్ఞానులారా! మీరు వచ్చి మాకు ఎంతో మేలు చేశారు. అయినా ఆ యూదుల రాజు ఎక్కడో తెలిసికొనుటయేకదా మా తక్షణ కర్తవ్యం. ఏమంటారు మంత్రి వర్యా?మనం కూడా పూజించాలి కదా?

మంత్రి :- అవును మహారాజా. (ఇంతలో భటుడు ప్రవేశం)

భటుడు :- జయము జయము మహారాజా. శాస్త్రులు వచ్చియున్నారు.(శాస్త్రుల ప్రవేశం)

హేరోదు :- శాస్త్రులారా! మెస్సియా జననమును గూర్చి మోషే ధర్మశాస్త్రం ఏమి చెప్పుచున్నది?ఆయన ఎవరికి ఎక్కడ జన్మించునో చెప్పగలరా?

1వ శాస్త్రి :- చిత్తం మహాప్రభు! ప్రవక్త యైనా యెషయా ఈవిధంగా ప్రవచించాడు ప్రభు. "కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి కన్యక గర్భవతియై కుమారుని కనును. అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు"

2వ శాస్త్రి :- మీకా ప్రవక్త ఈవిధంగా ప్రవచించాడు ప్రభు! "బెత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్ప గ్రామమైనను నాకొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును."

హేరోదు :- మంచిది. శాస్త్రులారా! ఇక మీరు వెళ్ళవచ్చును.

(శాస్త్రులు నమస్కరించి వెళ్ళిపోతారు.)

హేరోదు :- జ్ఞానులారా! విన్నారుకదా!! ఆ యూదులరాజు యూదయా బెత్లెహేమునందు కన్య గర్భమున జన్మించినాడట. కనుక మీరు వెళ్ళి ఆ యూదులరాజును దర్శించి ఆయన ఏ స్థలములో జన్మిచినాడో మాకును తెలియజెప్పినట్లయితే మేమును వెళ్ళి ఆరాజును దర్శించి వస్తాము. కావున మీరు బెత్లెహేము వెళ్ళిరండి.

1వ జ్ఞాని :- సంతోషము మహారాజ! ఇక మేము వెళ్తాము. మరలవచ్చి మీకును వర్తమానము అందించగలము.

హేరోదు :- మంచిది జ్ఞానులారా ! ఇక వెళ్ళిరండి
జ్ఞానులు :- (ముగ్గురు కుడి చేతులు చాపి దీవిస్తూ) మహారాజు చిరకాలం వర్ధిల్లుగాక.(వెళ్ళిపోవుదురు)

హేరోదు :- ( కోపంగా ) మహామంత్రి విన్నావా? ఆ యూదుల రాజట, బెత్లెహేములో జన్మించెనట, వింత నక్షత్రం ఉదయించెనట. తూర్పు జ్ఞానులట, లోక రక్షకుని చూడగ వచ్చినారట. ఇది జరుగుటకు వీలు లేదు. మంత్రి. మీరు వెంటనే వెళ్ళి ఈ యూదుల రాజు మరియు ఈ జ్ఞానులనులను గూర్చిన సమాచారము బయిటకు వ్యాపించకుండా చూడండి.
మంత్రి :- చిత్తం మహాప్రభు! (వెళ్ళును)

హేరోదు :- మూర్ఖపు జ్ఞానులు. ఇంత గొప్పరాజులము మేము ఉండగా మమ్ములను పూజించకుండ, ఆ బాలరాజును పూజించుటకు వెళ్తారా! రానిమ్ము, రానిమ్ము, వారి ద్వారా మేము ఆ సమాచారం తెలిసికొనిన తరువాత ఆ బుద్ధిలేని జ్ఞానులకు తగిన శాస్తి చేస్తాను. (సింహాసనము మీద చేయి వేసి) ఈ సింహాసనము మాది. మా స్వంత బలంతో సంపాదించుకున్నది. నేను కాన వేరొక యూదుల రాజు పుట్టుటయా? జరగడానికి వీలులేదు. ఆ తూర్పు దేశపు జ్ఞానులు తిరిగి రాగానే వారిచ్చిన సమాచారం ప్రకారం వెళ్ళి (కత్తి దూసి)మా ఖడ్గంతో ఆ శిశువును ఖండ ఖండాలుగా నరికి వేస్తాను. (పెద్దగా నవ్వుతూ) హాः...హాः...హాः....తరువాత నేనే శాశ్వతంగా యూదులకు రాజును, రాజులకు రాజును. హాः...హాः...హాः....

(తెర పడును)

# 11వ రంగము

స్టేజి అలంకరణ:-( పశువుల పాక, ఎదురుగా పశువుల తొట్టి ఉంటుంది. యోసేపు మరియలు మోకరించి ఉంటారు. వెనుప గాబ్రియేలు దూత నిలబడి ఉండును. పైన నక్షత్రం వెలుగుతు ఉంటుంది.)
(గొల్లలు ప్రవేశించి ఒక ప్రక్కగా మోకరిస్తారు.)

పెద్దోడు :- అరెయ్! మన కొరకు పుట్టిన రక్షకుడు నిజంగా ఈయనేరా!!
సిన్నోడు :- అవునన్నా! ఆ దూత చెప్పిన ప్రకారం ఈయనే ప్రపంచానికే ప్రభువు!!
సీమోను :- అవునురా! మనం విన్నది, చూచింది కూడా నిజమే!! కాబట్టి మనం వెంటనే ఈ సంగతిని లోకమంతా చాటుదాం. మన ఆనందాన్ని ప్రపంచమంతా పంచుదాం.
ముగ్గురు :-- ప్రభువా! మాలాంటి పాపులను రచ్చిండానికి వచ్చిన దేవా!! మా స్తోత్రాలు అందుకో నాయనా!!! అమ్మా మరియమ్మా! మీకు మా వందనాలు. మేము వెళ్ళి ఈ శుభవార్తను లోకమంతా చాటుతాం.
(గొల్లలు ఒక ప్రక్కనుండి వెళ్తు ఉండగా వేరక ప్రక్కనుండి జ్ఞానులు ప్రవేశించి మోకరిస్తారు.)
1వ జ్ఞాని :-పరిశుద్ధుడవగు ఓ దేవా! శ్రేష్టులలో అతి శ్రేష్టుడా!! నీవే అతి శ్రేష్టమైన రాజువని గుర్తెరిగి నీకు సమర్పించుటకు ఇదిగో ఈ శ్రేష్టమైన సువర్ణమును తెచ్చాను ప్రభువా. దయతో అంగీకరించు.
సువర్ణమిదే సుందరా! స్వీకరించు నరవరా!!
స్వర్ణఛాయ దేహుడా! స్తుతులు నీకే శ్రేష్టుడా!! (సువర్ణం సమర్పిస్తాడు)

2వ జ్ఞాని :- భూదిగంతములను సృజియించిన ఓ పరమ తండ్రీ! ఈ ప్రజల పాపరోగాన్ని స్వస్థపరచడానికి వచ్చినందులకు నీకు వేలాది వందనములు, స్తోత్రములు. నీవు స్వస్థ పరచు దేవుడవని గుర్తెరిగి ఔషధమగు ఈ బోళమును నీకు కానుకగా తెచ్చాను. దయతో స్వీకరించు.

బోళమిదే భూపతి! బోసినవ్వుల శ్రీపతి!!
భువిని దివిని నీవిక! బ్రోవుమా ఓ నిత్యుడా!!
(బోళాన్ని సమర్పిస్తాడు)

3వ జ్ఞాని :- ఆకాశ మహాకాశములలో నివసించు మహోన్నతుడవైన దేవా! దుర్వాసనతో నిండిన ఈ పాపలోకాన్ని నీ దివ్యమైన బలి యాగంతో ప్రక్షాలనము చేసి పరిమళము చేయడానికి వచ్చినావని గుర్తెరిగి ఆయాగంలో సమర్పించుటకు ఇదిగో ఈ సాంబ్రాణిని తెచ్చాను. దయతో అనుగ్రహించు. నీకు వందనములు స్తుతులు.

శాంతినిచ్చు నాయకా! సర్వ ప్రజల యాజక!!
చేకొను సాంబ్రాణిదే! స్వచ్ఛమైన రక్షక!!
(సాంబ్రాణిని సమర్పిస్తాడు)(జ్ఞానులు వెళ్ళిపోవుదురు.)

మరియ:- నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది

యోసేపు:- అవును మరియ, దేవుడు చేసిన ఈ గొప్ప కార్యమునకు మనము దేవుని ఘనపరచవలసి యున్నది. మనము వెంటనే దేవాలయమునకు వెళ్ళి ధర్మశాస్త్రం ప్రకారం కానుక అర్పించి ప్రభువును ప్రతిష్ఠ చేద్దాం.

(యోసేపు మరియలు బాలుని తీసుకొని వెళ్ళుచుండగా తెర)

# 12వ రంగము

స్టేజి:- (దేవాలయ అలంకరణను పోలి ఉండాలి. సుమెయోను ఆనందంగా ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్లుగా అటు ఇటు తిరుగుచుంటాడు.)

సమెయోను :- ఆహాఁ....ఎంత వింత దర్శనము..... రాత్రి పసిబాలుడైన ఆ లోక రక్షకుని స్వయంగా నా చేతులతో ఎత్తుకొనినట్లుగా దర్శనము వచ్చినది. ఈ ఉదయమున ప్రార్థనలో ఈ దినం ఆ దివ్యబాలుని చూచెదనని ఆత్మద్వారా ప్రభువు సెలవిచ్చెను కదా!
(మరల అటు ఇటు తిరిగి)
అయ్యో! ఎందరో వచ్చుచున్నారు, పోవుచున్నారు. నేను ఆ లోక రక్షకుని ఏలాగు గుర్తించగలను.ప్రభువా! నిన్ను గుర్తించుటకు నాకు తగిన జ్ఞానమును ప్రసాదించు తండ్రీ!!

(యోసేపు మరియలు బాలునితో ప్రవేశిస్తారు. యోసేపు చేతిలో రెండు పావురపు బొమ్మలు ఉండవచ్చు.

సుమెయోను వారిని ఆసక్తితో గమనిస్తుండగా, వెనుక తెరలోనుండి 'ఎకో' మైకులోనుండి "సుమెయోను....సుమెయోను..ఈయనే సర్వ లోక రక్షకుడు. సర్వ మానవాళి విమోచకుడు" అని వినిపిస్తుంది. సుమెయోను ఆకాశంవైపు చూచి నమస్కరించి, పసిబిడ్డకై చేతులు చాపగా మరియ అందిస్తుంది)

సుమెయోను:- దేవునికి స్తోత్రం.... హల్లేలూయ....ఆహాఁ... నా జీవితం నేటితో ధన్యమాయెనుగదా. ఈ ప్రభువును దర్శించుటకే దేవుడు నన్నింకను బ్రతికించెను. ఆయనకే మహిమ కలుగునుగాక.

(ఆకాశంవైపు చూస్తూ) నాథా! యిప్పుడు నీ మాట చొప్పున సమాధానముతో
నీ దాసుని పోనిచ్చుచున్నావు. అన్యజనులకు నిన్ను
బయలుపరచుటకు వెలుగుగాను, నీ ప్రజలైన
ఇశ్రాయేలుకు మహిమగాను, సకల ప్రజల యెదుట
సిద్ధపరచిన నీ రక్షణను నేను కన్నులారా చూచితిని.

(మరియతో) అమ్మా మరియమ్మ, యోసేపు! ప్రభువుకు తల్లి తండ్రిగా ఏర్పరచబడిన మీరు ధన్యులు. సమస్త ఆశీర్వాదములు మీపైఉండును. ఇదిగో ఈయన అనేకుల హృదయాలోచనలు బయలు పరచును. ఇశ్రాయేలీయులలో అనేకులు పడుటకును తిరిగి లేచుటకును వివాదాస్పదమైనగురుతుగా ఈయన నియమింపబడి యున్నాడు. (తిరిగి మరియతో) తల్లీ మరియ! నీ హృదయములోనుండి ఒక ఖడ్గము దూసికొనిపోవును.

(అన్న ప్రవేశం)

అన్న :- (సుమెయోను చేతులలో నుండి బిడ్డను తీసుకొని) ఇదెంత ఆశ్చర్యము! లోక రక్షకుని దర్శింప వెళ్ళుమని ఆత్మ నాతో సెలవిచ్చెను. ఈదినమును చూచిన నా జన్మ తరియించినది. ప్రభువా! నీవే ఈ లోకానికి వెలుగువు. రాజుల రాజుగా, యూదులరాజుగా, అందరి రాజుగా, నీవె ఈ సర్వలోకరక్షకుడవని గుర్తించాను. ఆత్మతోను, భక్తితోను నిన్ను దర్శించి, పూజించి ధన్యురాలనయ్యాను. ఘోరమైన పాపాలతో నిండిన ఈ లోకాన్ని నీ అమూల్యమైన ప్రేమతో కడుగుటకు వచ్చినావు. పరమందున్న ఆ యెహోవా తన అద్వితీయ కుమారుడవైన నిన్ను ఈ లోకానికి కానుకగా ఇచ్చినాడు. తండ్రీ! మేము నీకేమి కానుకను ఇవ్వగలము. కరుణామయా! అదిగో ఆ ఆకాశం వెలుగుచున్న ఆ నక్షత్రాన్ని నీకు కానుకగా ఇచ్చినట్లు, బెత్లెహేము గ్రామము చక్కటి పశువుల పాకను నీకు కానుకగా ఇచ్చినట్లు, దేవదూతలు జోలపాటలను నీకు కానుకగా ఇచ్చినట్లు, మేము కూడా నీ జన్మదినమైన ఈ క్రిస్మస్ సందర్భంగా మా హృదయాలను నీకు కానుకగా సమర్పిస్తున్నాము. మమ్ములను అనుగ్రహించు తండ్రీ!

సుమెయోను:-(అన్న చేతులలో నుండి బిడ్డను తీసుకొని కనుల నీరు కారుచుండగ)
ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహింపబడెను.
ఆయన భుజములమీద రాజ్యభారముండును, ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన
దేవుడు నిత్యుడగు తండ్రీ సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును.
ఓ ఇశ్రాయేలు! ఇదిగో నీ విమోచకుడు!! ఓ పాపులారా! ఇదిగో మీ పాపము భరించువాడు!!
సాతాను చెరలో బంధింపబడి నశించిపోతున్న ఓలోకమా !ఇదిగో మీ లోకరక్షకుడు...లోకరక్షకుడు..
లోకరక్షకుడు..దేవా నీకే మహిమ కలుగునుగాక...(మహిమ మహిమ దేవునికే-పాట) ---తెర---